
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
గురువారం 17 అక్టోబరు 2024





ఉమ్మడి కుటుంబంలోని పిల్లలు

ఆ ఇంట్లో అందరూ ఉద్యోగులే

- ఒకరు ఎక్సైజ్ సీఐ, నలుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులు
- కష్టాలు ఎదురైనా లక్ష్యం దిశగా పయనం
- చదువే ఆలంబనగా.. ఉన్నత స్థాయికి
- ఉమ్మడి కుటుంబంగా ఆదర్శంగా నిలుస్తున్న తోబుట్టువులు

6



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

- బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు
- ఎస్పీ అఖిల్ మహాజన్

8

అంతా అయోమయం



- ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు ప్రక్రియ పూర్తి
- మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో 1610 మంది సభ్యులు
- ఇందిరమ్మ ఇళ్లపై ఆశలు
- నియోజకవర్గానికి 3500 లక్ష్యం
- జిల్లాలో 1.10 లక్షల దరఖాస్తులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఇందిరమ్మ ఇళ్లపై మళ్లీ ఆశలు మొదలయ్యాయి. పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ నెల 11న కమిటీల నియామకాలపై ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీల పేరు రెండు రోజుల్లోనే పంపించాలని పేర్కొనడంతో అధికారుల్లో అయోమయానికి గురయ్యారు. ఎట్టకేలకు మున్సిపాలిటీ, వార్డులు, గ్రామ పంచాయతీల్లో కమిటీల నియామకం పూర్తి చేశారు. సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీల్లో 67 వార్డులు, 255 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలో ఐదుగురు చొప్పున 1610 మందితో కమిటీలు ఏర్పాటు చేశారు. సమయం తక్కువగా ఉండడంతో కమిటీల గుర్తింపులో గందరగోళం నెలకొందనే విమర్శలు వస్తున్నాయి.

కమిటీలు ఇలా

జిల్లాలో 255 గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాలు లేకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఇందిరమ్మ కమిటీల్లో సర్పంచ్ స్థానంలో ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. కమిటీలో స్వయం సహాయక సంఘాల నుంచి ఇద్దరు మహిళలు, గ్రామీణాభివృద్ధిపై అవగాహన కలిగిన వారు మరో ముగ్గురు గ్రామస్థులు ఉంటారు. వీరిలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు స్థానం కల్పిస్తారు. సిరిసిల్ల జిల్లాలో వేములవాడ మున్సిపాలిటీలో 28 వార్డులు, సిరిసిల్ల మున్సిపాలిటీలో 39 వార్డులు ఉన్నాయి. వార్డుల వారీగా వేసే కమిటీల్లో కౌన్సిలర్ ఛైర్మన్‌గా, మహిళా పొదుపు సంఘాల నుంచి ఇద్దరు ఉంటారు. వీరితో పాటు అవగాహన కలిగిన వారి నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీల నుంచి సభ్యులుగా తీసుకుంటారు. జిల్లాలో దాదాపు కమిటీల్లో 1610 మంది సభ్యులు ఉండనున్నారు. ప్రస్తుతం అధికారులు ఎంపిక చేసిన కమిటీల జాబితాను కలెక్టర్‌కు సమర్పించిన అనంతరం ఇన్‌చార్జి మంత్రి ఆమోదించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన కసరత్తు దాదాపు పూర్తి చేసినట్లుగా తెలిసింది.

నియోజకవర్గానికి ఎమ్మెల్యే ఛైర్మన్

ఇందిరమ్మ కమిటీల్లో నియోజకవర్గ స్థాయిలో స్థానిక ఎమ్మెల్యే ఛైర్మన్‌గా నియమించే అవకాశం ఉంది. ప్రస్తుతం మున్సిపాలిటీలో వార్డు కమిటీల ప్రక్రియ పూర్తవుతుంది. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే ఛైర్మన్‌గా, ఆర్డీవోలు, డీఎల్‌పీవోలు కన్వీనర్లుగా నియమించే అవకాశం ఉంది.

సంక్షేమ పథకాల్లో కమిటీలే కీలకం

ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనుల అమలుకు సంబంధించి ఇందిరమ్మ కమిటీలకు కీలకమైన బాధ్యతలు అప్పగిస్తారని భావిస్తున్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనూ కమిటీల ద్వారా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో కమిటీ సభ్యులు అర్హులను ఎంపిక చేయడంలో ప్రధాన పాత్ర ఉంటుందని భావిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే నియోజకవర్గానికి 3500 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వాటిని స్థానిక ఎమ్మెల్యే మున్సిపాలిటీ, మండలాల వారీగా కేటాయిస్తారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది డిసెంబరు 28 నుంచి ఈ ఏడాది జనవరి 6 వరకు జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులను స్వీకరించింది. ఆరు గ్యారంటీలకు సంబంధించి 1,92,617 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఇందిరమ్మ ఇళ్లకు లక్షా10వేల 198 దరఖాస్తులు వచ్చాయి. అమరవీరుల కుటుంబాల నుంచి 338 మంది దరఖాస్తు చేసుకున్నారు. 2130మంది తెలంగాణ ఉద్యమకారులు దరఖాస్తులు చేసుకున్నారు. సొంత స్థలం ఉన్నా బలహీన వర్గాల వారికి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. మొదటి విడతలో జిల్లాలో నియోజకవర్గానికి 3500ఇళ్లు మాత్రమే కేటాయిస్తుండగా దరఖాస్తులు మాత్రం లక్షకు పైగానే వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ ప్రారంభించి మళ్లీ దరఖాస్తులు స్వీకరిస్తే మరిన్ని పెరిగే అవకాశం ఉంది.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ ఎప్పుడో? .. 8లో

న్యూస్ బాక్స్

ఏజీపీ కృష్ణకు సన్మానం

ఎల్లారెడ్డిపేట అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అసిస్టెంట్ గవర్నమెంట్ ఫ్లీడర్‌గా ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామానికి చెందిన న్యాయవాది పసుల కృష్ణను నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. బుధవారం మండల కేంద్రంలోని ఆయన కార్యాలయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, మల్లేశం, కిషన్ పుణ్య నాయక్, ప్రభు నాయక్, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఎంజేజేఎం చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న రవీందర్‌రావు

గంభీరావుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో ప్రధాన మంత్రి జీవన జ్యోతి యోజన పథకం చెక్కును బాధిత కుటుంబానికి నాఫ్‌స్కాబ్ ఛైర్మన్ కొండూరు రవీందర్‌రావు బుధవారం అందజేశారు. లబ్ధిదారుడైన సత్తయ్య ఇటీవల మరణించగా బాధిత కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల చెక్కు మంజూరైంది. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ రామాంజనేయులు, మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

ఇల్లంతకుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట మండలంలోని సిరికొండలో బుధవారం దాత సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరరహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. సీసీ కెమెరాలతో నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు అనేక కేసులను ఛేదించడంలో సీసీ కెమెరాలు ఉపయోగపడ్డాయన్నారు. గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్, హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ, పంచాయితీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

తంగళ్లపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సర్కారు ఆదేశాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవారం తంగళ్లపల్లి మండలం కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. తరగతి గదిలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న తరగతి గది భవనం పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్తగా 6 గదులు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. టాయిలెట్స్ మరమ్మతు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లు ఉండేలా చూడాలన్నారు. వంట చేస్తున్న తీరును పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. పరిసరాలను వెంటనే శుభ్రం చేయాలని ఎంపీవోను ఆదేశించారు. ఎంఈవో రాజు, ప్రధానోపాధ్యాయులు శంకర్ నారాయణ, వెంకటేశ్వరస్వామి, తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడలు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈ నెల 19వరకు ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడలు సిరిసిల్ల పట్టణంలోని మినీస్టేడియంలో నిర్వహించనున్నట్లు బుధవారం ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్ర శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మొదటి రోజు గురువారం అండర్ - 14, అండర్ - 17 విభాగంలో బాలబాలికలకు వాలీబాల్ పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ నెల 18 శుక్రవారం రోజున అండర్ - 14, అండర్ - 17 విభాగంలో బాలబాలికలకు కబడ్డీ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 19 శనివారం చివరి రోజున అండర్ - 14, అండర్ - 17 విభాగంలో బాలబాలికలకు ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని అన్ని మండలాల నుండి విద్యార్థిని విద్యార్థులు పాల్గొనాలని ఎస్‌జీఎఫ్ క్రీడలను విజయవంతం చేయాలని కోరారు. వివరాలకు సెల్ : 9441170270 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఫీజు రీయిబర్స్‌మెంట్ విడుదలపై నిర్లక్ష్యం వీడాలి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకుండా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తోందన్నారు. విద్యార్థుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని, వారి జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ విడుదల చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు నిరసన తెలిపిన ప్రభుత్వం పట్టించుకోక పోవడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు మట్టె శ్రీనివాస్, కోడం వెంకటేష్, నారోజు వెంకటేష్, ముద్దం అనిల్‌గౌడ్, సాయి పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్

ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం పదిర, వెంకటాపూర్ గ్రామాల్లో సెర్ఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ మాట్లాడుతూ జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి 258 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వసతులు కల్పించామన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, శుద్ధి చేసిన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకు రావాలని అన్నారు. 40 కిలోల 600 గ్రాములు తూకం వేయాలన్నారు. కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలన్నారు. సన్నాలకు ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తోందన్నారు. పట్టాదారు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లను వెంట తెచ్చుకోవాలని సూచించారు. నిర్వాహకులు కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. కేంద్రాల్లో అవకతవకలు చోటు చేసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ సబేరాబేగం, ప్యాక్స్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్, పౌర సరఫరాల శాఖ అధికారి వసంతలక్ష్మీ, రజిత, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, నాయబ్ తహసీల్దార్ సత్యనారాయణ, సెర్ప్ ఏపీఎంలు మల్లేశం, ఏఎంసీ వైస్ ఛైర్మన్ రాంరెడ్డి, నాయకులు నర్సయ్య, గౌస్, రాజయ్య, బాలయ్య, రవీందర్, నారాయణరెడ్డి, సత్యనారాయణ, తిరుపతిరెడ్డి, కిష్టారెడ్డి, లక్ష్మీబుచ్చాగౌడ్, బాల్‌రెడ్డి, ఎల్లయ్య, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్ మండలం ఆవునూర్‌లో

రైతులు తాము పండించిన నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అన్నారు. మండలంలోని ఆవునూర్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో, గూడెం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ మాట్లాడుతూ జిల్లాలో రైతులు పండించిన వరి పంటను కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశారన్నారు. రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని అన్నారు. 17 శాతం కన్న తక్కువ తేమ ఉండాలని కోరారు. తాలు మట్టి గుల్లాలు, రాళ్లలేకుండా చూసుకోవాలని, సంచికి కేవలం 40.600 కిలోల ధాన్యాన్ని అమ్మాలని అన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి 2320, కామన్ గ్రేడ్ ధాన్యానికి రూ.2300 ధరను ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లాలో 70 లక్షల గన్నీ సంచులకు 30 లక్షల సంచులను ఇప్పటికే సెంటర్‌లకు పంపామని, సెంటర్‌కు 5 వేల చొప్పున అందించామని అన్నారు. గన్నీ సంచుల కొరత లేదన్నారు. ధాన్యం కొనుగోలు సెంటర్ నిర్వాహకులు కొనుగోళ్లను సక్రమంగా నిర్వహించాలని, ట్రాన్స్‌పోర్ట్ విషయంలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సహకార సంఘం ఛైర్మన్ తన్నీరు బాపురావు, ఏఎంసీ ఛైర్మన్ తలారి రాణినర్సయ్య, మాజీ జడ్పీటీసీ గుండం నర్సయ్య, డీఎస్‌వో వసంతలక్ష్మీ, రజిత .జిల్లా సహకార అధికారి రామకృష్ణ, తహసీల్దార్ సురేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ప్రతాప రెడ్డి, రాజు, వేణు, రవి, విష్ణు, ఏపీఎం దేవేందర్, రేణుక, డైరెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే సంఘాల అభివృద్ధి



రుద్రవరంలో భవనాన్ని ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, అక్టోబరు 16 (ఆధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతోనే సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధిస్తాయని వేములవాడ శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన భవనాన్ని టెస్కాబ్ ఛైర్మన్ కొండూరు రవీందర్‌రావుతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడారు. సహకార సంఘాలకు మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డితోనే పూర్వ వైభవం వచ్చిందన్నారు. రైతులు ఇబ్బందుల పడకుండా నిర్ణయాలు తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, వేములవాడ సింగిల్ విండో ఛైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, రుద్రవరం సింగిల్ విండో ఛైర్మన్ కృష్ణదేవరావు, మాజీ ఛైర్మన్ చింతపల్లి శ్రీనివాస్‌రావు, నాయకులు గాలిపెల్లి స్వామి, కత్తి కనుకయ్య, శ్రీనివాస్, నాగుల రాము, కట్ట శ్రీనివాస్, ఊరడి కిషన్, తాడెం శ్రీనివాస్, వంకాయల రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న డీఆర్‌డీవో శేషాద్రి

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, రైతులకు ఇబ్బందుల కలుగకుండా చూడాలని డీఆర్డీవో శేషాద్రి కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులతోపాటు ఏపీఎంలు, సెంటర్ ఇన్‌చార్జిలు, బుక్ కీపర్లకు కమిటీల సభ్యులకు ధాన్యం కొనుగోలుపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం 2024-25 సీజన్‌లకు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణను పరిశీలించాలన్నారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ ప్యాడీక్లీనర్ ద్వారా పట్టిన ధాన్యాన్ని సంబంధింత ఏఈవో ధ్రువీకరించిన వాటినే కొనుగోలు చేయాలన్నారు. సన్నరకం, దొడ్డురకం ధాన్యం వేరువేరుగా మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. కేటాయించిన రైస్‌మిల్లులకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని మాత్రమే తరలించాలన్నారు. సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని, సజావుగా చేపట్టాలని సూచించారు. తరలించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు ఓపీఎంఎస్‌లో నమోదు చేయాలన్నారు. సవరించిన విధానం ఆధారంగా కొత్తగా ప్రవేశపెట్టిన ఐరీస్‌లను రైతుల వారీగా నమోదు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు. నీడ సౌకర్యాలను కల్పించాలన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో అదనపు డీఆర్‌డీవో శ్రీనివాస్, డీపీఎం సుధారాణి, ఇన్‌చార్జి డీపీఎం శ్రీనివాస్, జిల్లా సమాఖ్య కార్యదర్శి జ్యోతి, సివిల్ సప్లయ్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్డు



కోతకు గురైన రోడ్డుపై వేసిన కంప

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట- సింగారం మధ్య ఉన్న రహదారి కోతకు గురైంది. గుంతలు ఏర్పడిన ప్రాంతంలో కర్రలు వేసి వదిలిపెట్టారు. వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, సంబంధిత అధికారులు రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

విధుల్లోచేరిన ఉపాధ్యాయులు

రుద్రంగి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2024లో ఉద్యోగాలు సాధించిన నూతన ప్రభుత్వ ఉపాధ్యాయులు బుధవారం రుద్రంగి మండల కేంద్రంలో ఎంఈవో రామకృష్ణ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు లక్ష్మీవేంకటేశ్వరుడి రథోత్సవం

భక్తులకు దర్శనమివ్వనున్న స్వామివారు వైభవంగా బ్రహ్మోత్సవాలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించే లక్ష్మీ వేంకటేశ్వరస్వామి మహారథోత్సవం, జాతర వైభవంగా జరగనుంది. మహారథంపై లక్ష్మీవేంకటేశ్వరస్వామి దర్శనమివ్వనున్నారు. సుమారు 800 సంవత్సరాల చరిత్ర కలిగిన సిరిసిల్ల లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయానికి సిరిసిల్లతోపాటు వివిధ మండలాల భక్తులు తరలివచ్చి దర్శించుకుంటారు. పూర్వం మానేరు నదీ ఒడ్డున ఒక మాండవ్య మహాముని ఆశ్రమం ఉండేదని, ఈ నదీ తీరాన మహావిష్ణుయాగం చేసే క్రమంలో రుషులు కఠోర దీక్ష చేపట్టారని, ఆ క్రమంలో మహావిష్ణువు ప్రత్యక్షమవడంతో ఈ నదికి మాండవ్య నదిగా పేరు వచ్చిందని చెబుతారు. ఆ కాలంలో జమీందారులు ఈ దేవాలయాన్ని నిర్మించారని చరిత్ర. ఆ తరువాత శ్రీశాల పేరుతో గ్రామ నిర్మాణం జరిగిన క్రమంలో కేశవనాథ స్వామివారిని ప్రతిష్ఠించారు. 200 సంవత్సరాల శాలివాహన శకం 1826లో మొగులాయిలు కాకతీయుల రాజ్యంపై దండెత్తి హిందూ దేవాలయాల్ని ధ్వంసం చేస్తున్న క్రమంలో కేశవనాథ స్వామి విగ్రహం కూడా పగులకొట్టారు. ఇప్పటికీ ఈ విగ్రహం దేవాలయంలో దర్శనమిస్తుంది. తిరుమల దేవాలయంలో ఉన్న మాదిరిగానే 12 వివిధ ఇత్తడి వాహనాలపై లక్ష్మీ వేంకటేశ్వరస్వామిని ఊరేగిస్తారు. తెలంగాణలోనే అతిపెద్దదైన 40 ఫీట్ల ఎత్తు ఉన్న రథోత్సవంపై స్వామివారిని తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. మరోవైపు జాతరలో బొమ్మలు అమ్ముకునే సంచార వ్యాపారులు భాగంగా వివిధ ప్రాంతాల నుంచి సిరిసిల్లకు చేరుకున్నారు.



సిద్ధంగా ఉన్న స్వామివారి మహారథం

రోడ్లపై ధాన్యం పోస్తే చర్యలు



రైతులతో మాట్లాడుతున్న సీఐ

చందుర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ధాన్యం ఆరబెట్టి రోడ్లను ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో చందుర్తి నుంచి గోవిందారం వెళ్లే రోడ్డులో ధాన్యం ఆరబెట్టే రైతులకు తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి రోడ్లపై ధాన్యం ఆరబెట్టొద్దని బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రోడ్లకు ఇరువైపులా ధాన్యం పోయవద్దన్నారు. గతంలో రోడ్డుకు ఇరువైపులా ధాన్యంతో ఆరబోయడంతో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండడానికి మండల రెవెన్యూ అధికారులు సూచించిన స్థలంలో ధాన్యం ఆరబోయాలన్నారు.


ఎండుతున్న ఆయిల్ పామ్ మొక్కలు

● ట్యాంకర్లతో నీటిని పోస్తూ కాపాడుకుంటున్న రైతులు



సిరిసిల్ల చిన్నబోనాలలో సాగుచేసిన అయిల్ పామ్ పంట

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): డ్రిప్‌లను మంజూ రు చేయకపోవడంతో సాగు చేసిన ఆయిల్‌పామ్ మొక్కలు ఎండిపోతు న్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆయిల్‌పామ్ సాగును చేయాలని గత ప్రభుత్వం తో పాటు ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం సైతం ప్రోత్సహి స్తుండడంతో రైతులు ఆయిల్ పామ్ సాగు చేసేందుకు ముందుకొచ్చారు. ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా 212 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశారు. మొక్కలను రైతులు వారివారి భూముల్లో సాగు చేసుకున్నారు. వాటిని నిత్యం సుమారు 40లీటర్ల నీటిని అందించాలని దానికి అవసరమైన డ్రిప్‌లను కూడా అందిస్తామని అధికారులు రైతుల నుంచి డీడీల రూపంలో డబ్బులను తీసుకున్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసి 3నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆ రైతుల కు డ్రిప్‌లు మంజూరు కాలేదు. సాగుచేసిన ఆయిల్‌పామ్ మొక్కలు నీరులేక ఎండిపోతుండడంతో వాటిని కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల గ్రామానికి చెందిన యువ రైతు దడిగెల శ్రావణ్ రావు తనకు ఉన్న 9ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేసేందుకు ముందు కు రాగా ఉద్యాన అధికారులు 450 మొక్కలను సరఫరా చేశారు. ఆ రైతు మొక్కలను నాటి మూడు నెలలు గడుస్తున్నాయి. డ్రిప్‌కోసం రూ 1.80 లక్షల డీడీ చెల్లించినా ఇంతవరకు మంజూరు చేయకపోవడంతో నీరులేక ఆ మొక్కలు ఎండిపోతున్నాయి. రైతులు ట్యాంకర్లను ఏర్పాటుచేసి కూలీలలతో వారం రోజులనుంచి ఆయిల్‌పామ్ మొక్కలకు నీటిని పోయిస్తూ కాపాడుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి డ్రిప్‌లను మంజూరు చేసి మొక్కలను కాపాడాలని కోరుతున్నారు.



నీళ్లులేక ఎండిపోయిన మొక్క

ట్యాంకర్‌తో నీటిని పోస్తున్న



చిన్నబోనాల శివారులో 9 ఎకరాలల్లో మూడు నెలల క్రితం ఆయిల్‌పాం మొక్కలను సాగు చేశాను. డ్రిప్‌కోసం డబ్బులను చెల్లించినా ఇంతవరకు డ్రిప్ మంజూరువక పోవడంతో ట్యాంకర్లతో నీటిని పోయిస్తూ మొక్కలను కాపాడుకుంటున్నాను. అధికారులు స్పందించి మొక్కలను కాపాడానికి డ్రిప్‌లను అందించాలి.

- దడిగెల శ్రావణ్‌రావు, యువరైతు, చిన్నబోనాల

ఆ ఇంట్లో అందరూ ఉద్యోగులే

ఆ ఇంట్లో అందరూ ప్రభుత్వ ఉద్యోగులే. కుటుంబంలో ఒకరు ఎక్సైజ్ శాఖలో సీఐగా పని చేస్తుండగా నలుగురు ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు. అందరూ ఉద్యోగులైనా ఉమ్మడిగా కలిసే ఉంటున్నారు. ప్రస్తుత సమాజంలో ఉమ్మడి కుటుంబాలు కనిపించే సంఘటనలు అరుదు. చిన్న విషయాలకే విడిపోతున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. అటువంటిది ఆ తోబుట్టువులంతా ఉద్యోగాలు చేస్తున్నా ఎలాంటి అహం లేకుండా ఉమ్మడి కుటుంబంగా ఉంటున్నారు. ఆదాయాల గురించి ఏనాడూ ఆలోచన చేయకుండా ఒకరికొకరు సాయంగా జీవిస్తున్నారు.



తల్లి పోచవ్వతో కొడుకులు, కూతుళ్లు

ఆదర్శం

- ఒకరు ఎక్సైజ్ సీఐ, నలుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులు
- కష్టాలు ఎదురైనా లక్ష్యం దిశగా పయనం
- చదువే ఆలంబనగా.. ఉన్నత స్థాయికి
- ఉమ్మడి కుటుంబంగా ఆదర్శంగా నిలుస్తున్న తోబుట్టువులు

గంభీరావుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : చదువే ఆలంబనగా అద్భుత విజయాలు సొంతం చేసుకున్న ఆ తోబుట్టువులు పలువురి అభినందనలు అందుకుంటున్నారు. అందరూ ఉద్యోగులైనా ఉమ్మడిగా కలిసే ఉంటున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన మరాఠి పోచవ్వ-రాజయ్య దంపతులకు ఐదు గురు సంతానం. వారిలో ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. వారంతా నర్మాల ప్రభుత్వ పాఠశాలలో మూడో తర గతి వరకు, గంభీరావుపేట హాస్టల్లో ఉంటూ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి నుంచి పదోతరగతి వరకు చదువుకున్నారు..

యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసించారు. ఐదుగురు సంతానంలో పెద్ద కుమారుడు మరాఠి రాజమల్లికార్జున్ ప్రభుత్వ టీచర్‌గా, రెండో కుమారుడు చంద్రశేఖర్ ఎక్సైజ్ శాఖలో సీఐగా, పెద్ద కూతురు వెంకటలక్ష్మి, రెండో కూతురు దేవలక్ష్మి, చిన్న కుమారుడు అజయ్ కుమార్ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు చేస్తున్నారు. పెద్ద వాడైన మల్లికార్జున్ స్థానిక ప్రైవేటు పాఠశాలలో నెలకు రూ.200 జీతానికి చేరి ప్రైవేటు ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ఆరంభించాడు. ఆ పాఠశాలలో తోటి ఉపాధ్యాయుల సలహాలతో ఉన్నత అభ్యాసం మొదలు పెట్టాడు. ఎంఏ, ఎంఫిల్, టీపీటీ, బీఈడీను పూర్తి చేశాడు. రెండో కుమారుడు చంద్రశేఖర్ మొదట అగ్రికల్చర్ అధికారిగా పనిచేశాడు. ఆ సమయంలో చాలా మందితో స్నేహాన్ని పెంచుకున్నాడు. గ్రూపు టూ ద్వార ఆబ్కారీ శాఖలో ఎస్సైగా నియామకమయ్యాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో సీఐగా పనిచేస్తున్నాడు. వారి మార్గంలోనే ఇద్దరు చెల్లెళ్లను తమ్ముడిని నడిపించారు.

ఆత్మీయత, ఆనురాగాల నిలయం

ప్రస్తుత సమాజంలో చిన్న విషయాలకు విడిపోతున్న కుటుంబాలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నా ఆ తోబుట్టువులు ఉమ్మడిగా ఉంటున్నారు. కుటుంబంలో ఇరవై మందికి పైగా ఉంటారు. వారికి తోడు వచ్చిపోయే చుట్టాలు అదనం. అందరూ ఉద్యోగులైనా జీవితాన్ని పైసలతో కొలువక పోవడం వారి ప్రత్యేకత. ఎలాంటి గర్వం లేకుండా ఒకరికొకరు సర్దుకుపోవడం వారిలో ఉన్న గొప్ప గుణం. పిల్లల్లో వచ్చే చిన్న చిన్న మాట పట్టింపులు చూసి నచ్చజెబుతారు.

అక్షరమే మా ఇంటిని నిలబెట్టింది..: మల్లికార్జున్, టీచర్



అక్షరమే మా ఇంటిని నిలబెట్టింది. మా అమ్మనాన్నల కష్టాన్ని వృథా చేయలేదు. వాళ్లు నేర్పిన అణకువ, ఆదరణ కొనసాగించాం. మా అమ్మనాన్న లు ఆకలిని చంపిండ్రుగానీ అక్షరాన్ని చంపలేదు. వారు అందించిన అక్షరాలను ఆసరా గా చేసుకున్నాం. ఒకరు ఎక్సైజ్ శాఖలో సీఐగా, నలుగురం ఉపాధ్యాయులుగా ఎదిగాం. తల్లిదండ్రులు నేర్పిన క్రమశిక్షణను భావితరాలను అందించడమే మా కర్తవ్యం.

చిన్నతనంలో కష్టాలు..: చంద్రశేఖర్, సీఐ, ఎక్సైజ్ శాఖ



మా చిన్న తనంలో ఎన్నో కష్టాలు పడ్డాం. చదువుకోవాలనే ఆశయం ముందు ఎంత పెద్ద కష్టమైన చిన్నదిగా కనిపించేది. మా తల్లిదండ్రులు మా కోసం పడిన కష్టం చూసి అనేక సార్లు కన్నీళ్లు పెట్టుకున్నా. పెద్దాయ్యాక మా పిల్లలు ఎవరి ముందూ చేయి చాచకుండా ఉంటే చాలు అన్న మా అమ్మానాన్నల మాటలు ఇప్పటికి గుర్తుకొస్తాయి. ఒకప్పుడు మేమూ ఎందరినో సాయం కోరాం. ఇప్పుడూ ఇంకొకరికి సాయం చేసే స్థితిలో ఉన్నాం. మా అమ్మానాన్నలు ఆశించింది కూడా ఇదే.

క్రైం కార్నర్

మానేరులో దూకి వ్యక్తి ఆత్మహత్య

గంభీరావుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టులో దూకి ఇస్సాయిపేటకు చెందిన గుడ్లపల్లి ప్రకాష్ (55) ఆత్మహత్య చేసుకున్నాడు. కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఇస్సాయిపేటకు చెందిన గుడ్డపల్లి ప్రకాష్ కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. రెండేళ్ల క్రితం కూతురు పెళ్లికి చేసిన అప్పు, తన భార్య అనారోగ్యానికి గురవగా ఆసుపత్రుల్లో చూపించేందుకు చేసిన అప్పు భారమయ్యాయి. అప్పుతీర్చే మార్గం లేక తరచూ కుటుంబ సభ్యులతో మనోవేదనకు గురయ్యాడు. మంగళవారం ఇంటి నుంచి కూలీ పనికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. బుధవారం నర్మల మానేరు ఒడ్డున దుస్తులు చెప్పులు ఉండడతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనుమానంతో మానేరులో వెతకగా ప్రకాష్ మృతదేహం లభించింది. అప్పుల బాధతోనే తన భర్త మానేరులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరి రిమాండ్

సుల్తానాబాద్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): గుడుంబాను విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు సుల్తా నాబాద్ ఎక్సైజ్ సీఐ గురునాథ్ రాథోడ్, ఎస్ఐ ఎస్ఎస్ఎన్ రాజు తెలిపారు. మండల కేంద్రంలోని మార్కండేయ కాలనీకి చెందిన బండారి స్వాతి, వడ్డెర కాలనీకి శాంతినగర్‌కు చెందిన కోట స్వరూపలు గతంలో గుడుంబా విక్రయించగా వారిని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచామని, నిబంధనలు ఉల్లంఘించి మళ్లీ గుడుంబా విక్రయిస్తుండగా ఎస్ఐ రాజు, సిబ్బంది ఇద్దరిని అదుపులోకి తీసుకుని బుధవారం తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి ఎదుట హాజరుపరచగా వారిని రిమాండ్ తరలించాలని ఆదేశించారన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కథలాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరికొండ గ్రామబస్టాండ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన చెట్టుపల్లి అంజయ్య(52) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంజయ్య బస్టాండ్ సమీపంలో నడుచుకుంటూ రోడ్డు దాటుతుండంగా ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తి కునుకుల అనిల్ కుమార్ అతివేగం అజాగ్రత్తతో వచ్చి అంజయ్యను ఢీకొట్టాడు. సంఘటనలో అంజయ్య తీవ్రగాయాలు కాగా కుటుంబ సభ్యులు కోరుట్లలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండంగా మార్గ మధ్యంలో అంజయ్య మృతి చెందాడు. మృతుడు అంజయ్య కుమారుడు హరీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్ తెలిపారు.

జ్వరంతో బాలుడి మృతి

కోరుట్ల రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని చిన్నమెట్‌పల్లి గ్రామానికి చెందిన మ్యాడవేణి అశ్వద్ (11) అనే బాలుడు జ్వరంతో మృతి చెందాడు. స్థానికుల సమాచారం ప్రకారం.. చిన్నమెట్‌పల్లి గ్రామానికి చెందిన మ్యాడవేణి రత్నాకర్-రాధ దంపతుల కుమారుడు అశ్వద్ కోరుట్ల పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. అశ్వద్ నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా స్థానికంగా ఆర్ఎంపీ వద్ద చికిత్స అందించారు. మంగళవారం పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబసభ్యులు కోరుట్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అశ్వద్ తీవ్ర జ్వరంతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

అట్రాసిటి కేసుపై డీఎస్పీ విచారణ



మేడిపల్లిలో విచారణ చేస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

మేడిపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మేడిపల్లి మండల కేంద్రంలో గొడవలు జరిగి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు కాగా గ్రామానికి డీఎస్పీ బుధవారం వచ్చి విచారణ చేశారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం జరిగిన జాతరలో యువకులు ఒకరిని ఒకరు తోసుకోవడంతో ఇరువర్గాల మధ్య గొడవకు దారి తీసింది. దాంతో ఒకరిపై ఒకరు దాడికి పాలుపడ్డారు. అడ్డు వచ్చిన యువకుపై సైతం దాడి చేశారు. దాంతో కొంత మంది యువకులకు గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరువర్గలవారిని శాంతింప చేశారు. వారిపై కేసు నమోదు చేశారు.

అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న నందెల్లి మహిపాల్

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 17, 18, 19 తేదీల్లో నిర్వహించనున్న దక్షిణ భారత జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. గత నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న ఇ విష్ణువర్ధన్ పదివేల మీటర్లు, ఎం వినయ్ 3 వేల మీటర్ల పరుగు పోటీల్లో, గైని నక్షత్ర ట్రయథ్లాన్‌లో ప్రథమ స్థానాల్లో నిలిచి దక్షిణ భారత జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ క్రీడాకారులు నటరాజ్ రవి, హరికిషన్, రవికుమార్, రాజగోపాలాచారి, జగ్వీందర్ సింగ్, బిషన్‌సింగ్ అభినందించారు.

గుండె పోటుతో చిన్నారి మృతి



శ్రీయాన్వి (ఫైల్)

జమ్మికుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి గుండె పోటుతో మృత్యువాత పడింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం పంగిడిపల్లి గ్రామానికి చెందిన మేడిపల్లి రాజు - జమున దంపతుల కూతురు శ్రీయాన్వి(4). రాజు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ భార్యాపిల్లలతో ఇక్కడే నివాసం ఉంటున్నాడు. శ్రీయాని పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతోంది. మంగళవారం ఉదయం నిద్రలేచిన తర్వాత పాఠశాలకు వెళ్లేందకు రెడీ అవుతూ ఒక్కసారిగా కిందపడిపోయింది. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు హుటాహుటిన హన్మకొం డలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు చిన్నారి ఊపిరితిత్తులో ఒక లేయర్ ఎర్పడిందని దాని వల్ల శ్వాస సరిగా ఆడక గుండెపోటు వచ్చి మృతి చెందినట్లు నిర్ధారించారు.

నాడు ఒకే బావికి ఏడుమోటలు

● నేడు అదే పేరుతో ఏడుమోటలపల్లి గ్రామం ఏర్పాటు



ఏడుమోటలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

పెగడపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నాడు సాగు నీటి కొరతతో ఒకే బావికి ఏడుమోటలు ఏర్పాటు చేయగా నేడు అదే గ్రామంగా ఏర్పడి ఏడు మోటలపల్లి గ్రామపంచాయతీగా పిలువబడుతోంది పెగడపల్లి మండలంలోని ఓ గ్రామం. పెగడపల్లి మండల కేంద్రానికి అనుబంధ గ్రామంగా ఉన్న చెర్లపల్లి (చెరువుకు ఆనుకుని ఉన్న ఇళ్లు) ఒకప్పుడు చెర్లపల్లిగా పిలవబడుతుండేది. కాగా 1970కి పూర్వం సాగునీటి కరువు ఉన్నపుడు చెరువు శిఖంలో వ్యవసాయ బావిలో నీరు సమృద్ధిగా ఉండటంతో ఒకే బావికి ఏడుమోటలు (అప్పట్లో ఎద్దుల సాయంతో నీటిని తోడేందుకు వ్యవసాయానికి మోటలు వాడేవారు) ఏర్పాటు చేశారు. కాగా అప్పటి నుంచి చెర్లపల్లి గ్రామమే ఏడుమోటలపల్లిగా మార్పు చెంది నేడు ఏడుమోటలపల్లి పేరుతోనే గ్రామపంచాయతీగా ఏర్పడి ప్రత్యేకత సంతరించుకుంది. దీంతో ఒక బావి పేరుతో నేడు గ్రామం ఏర్పడి ప్రత్యేకతను సంతరించుకుంది.

పద్మశాలీల్లో రాజకీయ చైతన్యం రావాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కామర్తపు మురళి

● పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి

సుభాష్‌నగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పద్మశాలీల్లో రాజకీయ చైతన్యం రావాలని, స్థానిక సంస్థ ఎన్నికల్లో సత్తా చాటాల్సిన అవసర ముందని తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామర్తపు మురళి అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని పద్మశాలి సంక్షేమ ట్రస్టు భవనంలో రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడం అభినందనీయమన్నారు. స్వర్గీయ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్‌రావు సేవలు మరువలేమన్నారు. మచ్చ ప్రభాకర్‌రావు పద్మశాలి శంఖారావం పేరుతో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, ప్రధానకార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం, ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రరావు, రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ వాసాల రమేశ్, వొళ్ళా కృష్ణహరి, బొల్ల శివకుమార్, అవ్వారి భాస్కర్, బొమ్మ ప్రవళిక, బొమ్మ అమరేందర్, మార్త ప్రకాశ్, అంబటి శ్రీనివాస్, బొమ్మ రఘురాం, మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, స్వర్గం మల్లేశం, పోలు సత్యనారాయణ, దూడం శ్రీనివాస్, గుడిమల్ల శ్రీకాంత్, కార్పొరేటర్లు చొప్పరి జయశ్రీ, లెక్కల వేణుగోపాల్, ఇప్పలపల్లి సాంబయ్య అరకాల వీరేశలింగం, గడ్డం వెంకటేశం, దీకొండ లక్ష్మినారాయణ, ఒడ్నాల రవీందర్, జక్కని ప్రభాకర్, స్వర్గం నరసయ్య, మేముల చంద్రశేఖర్, ఎల్ల మహేశ్, నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.



చెట్టును ట్రాక్టర్‌లో తరలిస్తూ..





ఎక్స్‌కవేటర్ సహాయంతో ఇలా నాటుతూ..




తిరిగి ప్రాణం పోసుకున్న వృక్షాలు..

మహా వృక్షాలకు జీవం

రాయికల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఒక్కరి ఆలోచనకు గ్రామం అంతా ఏకమై వృక్షాల రక్షణకు శ్రీకారం చుట్టారు.. మొక్కలు నాటడమే కాదు ఏళ్ల నాటి నుంచి ప్రాణవాయువు అందిస్తున్న మహా వృక్షాలను కాపాడటం పర్యా వరణ పరిరక్షణ అని నమ్మారు.. ఒక చోట తొలగించిన వృక్షాలకు మరో చోట ప్రాణం పోసి కాపాడుతున్నారు జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామస్థులు.

వటా ఫౌండేషన్ స్ఫూర్తితో..

ఇటిక్యాల గ్రామానికి చెందిన సుంకి శాల సత్తయ్య అనే గీత కార్మికుడు హైదరాబాద్‌లోని వటా ఫౌండేషన్ స్ఫూర్తితో రహదారులు, భవనాల నిర్మాణంలో తొలగించే మహా వృక్షాలను ఇతర చోట నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫౌండేషన్‌లో ఉద్యోగులు ప్రతీ ఆదివారం రోడ్ల పక్కన ఉన్న పెద్ద వృక్షాలను తొలగిస్తే వాటిని తిరిగి ట్రాన్స్ లోకేషన్ పద్ధతిలో నాటేవారు. ఇదే స్ఫూర్తితో గ్రామస్థులు, గంగాదేవి ఉద్యా నవన కమిటీ సహకారంతో గ్రామ శివారులోని మామిడి తోట ఆవరణలో సుమారు 15 నుంచి 18 ఏళ్ల రావి, జువ్వి ఇతర రకాల 13 చెట్లను తొలగిం చారు. వాటిని గ్రామంలోని పలు చోట్ల నాటి రెండు నెలల్లో 11 చెట్లకు ప్రాణం పోశారు. చెట్లను ఇతర ప్రాంతాలకు తరలించి నాటడానికి అయ్యే ఖర్చులు గ్రామస్థులు భరిస్తున్నారు. ఒక్కో వృక్షాన్ని తరలించి కాపాడటానికి సుమారు 2,500 రూపాయల వరకు ఖర్చు అవుతుండగా గ్రామానికి చెందిన ఏఎస్ ఎల్ పార్శిల్ వైస్‌చైర్మన్ హిమవంతరావు, గ్రామస్థులు భరించి వృక్షాలను కాపాడారు. మహా వృక్షాలను ట్రాన్స్ లోకేషన్ పద్ధతిలో తరలించి అనువైన చోట నాటడం ద్వారా పర్యావరణ రక్షణ సాధ్యమవుతుందని చాటుతున్నారు. జిల్లాలో జగిత్యాల-కరీంనగర్ రహ దారిలో ఏళ్ల నాటి వృక్షాలను ఇదే పద్ధతిలో ఇతర చోట్ల నాటాలని ఇటీవల జిల్లా కలెక్టర్‌ను కమిటీ సభ్యులు కోరారు. రాయికల్ అటవీ శాఖ అధికారులు పరిశీ లించి గ్రామస్థులను ఇటీవల అభినందించారు.




సత్తయ్య తిరిగి నాటిన వృక్షాలు

గ్రామస్థుల సహకారంతో...

పది సంవత్సరాలుగా గ్రామంలో పచ్చదనం కోసం వివిధ రకాల మొక్కలు నాటుతున్న తనకు వటా ఫౌండేషన్ స్ఫూర్తితో ట్రాన్స్ లోకేషన్ చేయాలనే ఆలోచన వచ్చింది. వృక్షాల రక్షణ అనే నా ఆలోచనకు గ్రామస్థులు సహకరించడంతోనే 13 వృక్షాలను మరో చోట నాటగా 11 వృక్షాలను కాపాడుకు న్నాం. ట్రాన్స్‌లోకేషన్ పద్ధతికి ఫైకాస్ జాతికి చెందిన రావి, జువ్వి, వేప, మామిడి, మారేడులాంటి వృక్షాలు అనువుగా ఉంటాయి. భారీ వృక్షాలను ఈ పద్ధతిలో నాటి మళ్లీ ప్రాణం పోయవచ్చు.



- సుంకిశాల సత్తయ్య, ఇటిక్యాల



- సంగీత, సాహిత్యాల్లో దిట్ట
- పద్నాలుగు భాషల్లో ప్రావీణ్యం
- పదుల సంఖ్యలో అనువాదాలు చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

రెండు భాషలు నేర్చుకోవడమే గగనమై పోతున్న ఈ రోజుల్లో పద్నాలుగు భాషలపై పట్టు సాధించడం సామాన్యమైన విషయం కాదు. అలాంటిది దేశంలోని విభిన్న సంస్కృతులపై అధ్యయనం ప్రారంభించి పలు భాషలపై పరిశోధన చేశారు. ఆ భాషల్లోని సాహిత్యాన్ని తెలుగు ప్రజలకు అనువాదాల రూపంలో అందించారు. ఆయా భాషల్లోని అంశాలతోనే ఎంఫిల్, పీహెచ్‌డీ చేశారు. ఇప్పటి వరకు కవిత్వం, కథ, నవల అనువాదాలు కలిపి 33 పుస్తకాలకుపైగా వెలువరించారు. సైన్స్ స్కూల్ టీచర్‌గా పనిచేస్తూ తెలుగు సాహిత్యం చదివి డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా ఎదిగి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు డాక్టర్ నలిమెల భాస్కర్. బహు భాషలు నేర్చుకోవడంతో పాటు సంగీతంపై ఎలా ఆసక్తి పెరిగిందో తన అంతరంగాన్ని డాక్టర్ నలిమెల భాస్కర్ 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు..

బహు భాషల భాస్కరుడు

కొలనూరు రైల్వే స్టేషన్‌లో వివిధ పుస్తకాలు..

కొలనూరు గ్రామంలో 1979లో ఉపాధ్యాయుడిగా ఉద్యోగం చేశాను. ఆ సమయంలో ఖాళీ సమయం ఎక్కువగా ఉండేది. ఆ గ్రామానికి దినపత్రిక వచ్చేది కాదు.. లైబ్రరీ లేదు. ఇతర అలవాట్లు ఏమీ లేని నాకు పుస్తక పఠనమే ఇష్టమైన అభిరుచి. దీంతో కన్నడ భాష పుస్తకంపై అధ్యయనం మొదలుపెట్టాను. ఆ పుస్తకం పూర్తి చేశాను. అప్పటికే హిందీ, తమిళం, కన్నడ భాషలపై అవగాహన వచ్చింది. తర్వాత మిగతా భాషలపై దృష్టి సారించాను. కొలనూరు రైల్వే స్టేషన్‌లో చందమామ పుస్తకంతో పాటు అన్ని భాషా పుస్తకాలు, వివిధ భాషల్లో వచ్చే ఇండియా టుడే లభించేవి. వాటిని చదువుతూ భాషలపై పట్టు సాధించాను. ఈక్రమంలోనే ఎంఫిల్ చేయాలని పించింది. ఏ అంశం మీద ఎంఫిల్ చేయాలనే ఆలోచన చేసినపుడు కొత్తపల్లి వీరభద్రారావు రాసిన 'తెలుగు పరిశోధనల భవిష్యత్ దర్శనం' పుస్తకంలోని ఒక వాక్యం నన్ను ఆకట్టుకున్నది.

'స్వాతంత్ర్యం రాక ముందు పాశ్చాత్యులు మన దేశం వచ్చి ఇక్కడి భాషలు నేర్చుకున్నారు. కానీ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతీయులెవరూ తమ మాతృభాష కాక ఇతర పొరుగు భాషలు నేర్చుకోవడం లేదు.' అన్న ఆయన మాటలు నన్ను ఆలోచింపజేశాయి. అప్పుడే నేను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'తెలుగు, తమిళ, కన్నడ, మలయాళీ సామెతల తులనాత్మక పరిశీలన' అనే అంశంపై ఎంఫిల్ పూర్తి చేశాను. ఆ తర్వాత బెంగాలి, అస్సామి, ఒరియా, గుజరాతి, పంజాబీ, ఉర్దూ, సంస్కృత భాషలను పదేళ్లలో పూర్తిగా నేర్చుకున్నాను. అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'తెలుగు మళయాల సామెతల్లో కుటుంబ జీవన చిత్రాలు' అనే అంశంపై పీహెచ్‌డీ చేశాను.

• బాల్యంలోనే హిందీపై ఆసక్తి

చిన్నప్పటి నుంచే ఇతర భాషలపై ఆసక్తి ఉండేది. మా ఊరిలో మేదరి రాజయ్య అనే వ్యక్తి హిందీ చాలా బాగా మాట్లాడేవాడు. నేను ఆయనతో మాట్లాడాలని ప్రయత్నించాను. తొమ్మిదో తరగతిలోకి వచ్చే సరికి హిందీ మాట్లాడడం వచ్చింది. రాజయ్య ఎప్పుడు కలిసినా హిందీలోనే మాట్లాడేవాడిని. మా ఉపాధ్యాయులు రామన్న, చక్రపాణి హిందీ చాలా బాగా చెప్పేవారు. దీంతో హిందీపై ఆసక్తి పెరిగింది. ఒకసారి కామారెడ్డికి వెళ్లినప్పుడు అంబటిపూడి రాసిన 'అరవం నేర్చుకోండి' అనే పుస్తకం కనిపించింది. నేను, నా స్నేహితుడు డి కిషన్ దానిని కొనుక్కొని బట్టీపట్టేశాం. దీంతో తమిళం మాట్లాడడం అలవాటైంది. రెండు భాషల్లో ప్రవేశం లభించడంతో ఇతర భాషలపై ఆసక్తి పెరిగింది. ఆ క్రమంలోనే 1977లో మరో స్నేహితుడు వేముల సత్యనారాయణతో కలిసి '30 రోజుల్లో కన్నడ భాష' అన్న పుస్తకం కొన్నాను. ఆ భాషనూ నేరుకున్నాను.



విభిన్న సంస్కృతుల అధ్యయనం

భారతీయ భాషలు నేర్చుకునే క్రమంలో 1990 ప్రాంతంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో వారం, పది రోజులు ఉండి అక్కడి సంస్కృతి, భాష, స్థానిక మాండలికాలను పరిశీలించాను. వివిధ రాష్ట్రాలకు వెళ్లినపుడు అక్కడి పుస్తకాలు తెచ్చుకున్నాను. ఇప్పటికీ తమిళ, మళయాళ, కన్నడ భాషల సాహిత్య పత్రికలు వస్తాయి. ఇటీవల గుజరాతీ భాషలో మహాత్మాగాంధీ ఆత్మకథ చదివాను. ఇష్టమైన సాహిత్యాన్ని ఆ మూల భాష ద్వారానే అధ్యయనం చేస్తాను.

మా ఊరు నారాయణపురంలో ఒక విద్యార్థి మీకు స్పానిష్ భాష వచ్చా అంకుల్ అని అడిగాడు.. రాదని చెప్పి దీని సంగతి తెలుసుకుందామని నేర్చుకోవడం ప్రారంభించాను. అది కొంత వంట బట్టింది. మా ప్రాంతం నుంచి చాలా మంది గల్ఫ్ దేశాలకు వలస వెళ్తారు. వాళ్ల కోసం అరబ్బీ, ఫ్రెంచి నేర్చుకుందామనుకున్నాను కానీ ఆరోగ్యం సహకరించలేదు. అనంతరం అన్ని మూల భాషల్లోని కథలను తెలుగులోకి అనువదించాను. తెలుగు నుంచి ఇతర భాషల్లోకి కూడా అనువదించాను. మంద మరికొన్ని కథలు అనే పేరుతో కథల పుస్తకాన్ని వేశాను. అందులో అన్ని భాషల కథలు ఉన్నాయి. 2000 సంవత్సరం తర్వాత తెలంగాణ భాష అధ్యయనం చేసి తెలుగు భాషకు తెలంగాణ మూలమని పలు సభల్లో నొక్కి చెప్పాను. తెలంగాణ భాష దేశ్య పదాలు, తెలంగాణ భాష సంస్కృత పదాలు, తెలంగాణ భాష తమిళ పదాలు, తెలంగాణ భాష క్రియా పదాలు అనే పుస్తకాలు వెలువరించాను.

అ'విశ్రాంత' సాధకుడు



మా ఊరు నారాయణపురం.. అక్కడ ఎప్పుడూ ఏదో ఒక సాంస్కృతిక కార్యక్రమం జరిగేది. దీంతో నాకు సంగీతంపై ఆసక్తి పెరిగింది. మా ఇంటి ముందే నా సీనియర్ అయిన ఎల్ నారాయణ అనే వారు ఉండేవారు. ఆయన ద్వారా పాటలు, పద్యాలు నేర్చుకున్నాను. లవకుశ నాటకంలో లవుడి పాత్ర వేశాను. గొల్లపల్లిలో శారద నాట్య కళా మండలి వారి నాటకాలు చూశాను. కృష్ణ రాయబారం నాటకంలో కృష్ణుడి పాత్ర వేశాను. అప్పుడే హార్మోనియం వాయించడం నేర్చుకున్నాను. పాటలు పాడేవాణ్ణి. కానీ ఏ రాగమో తెలిసేది కాదు. 2011లో ఉద్యోగ విరమణ చేసిన తర్వాత సంగీతం సాధన ప్రారంభించాలనుకున్నాను. కరీంనగర్‌లో ఉండే కేబీ శర్మ వద్ద 20 రోజులు సంగీతం పాఠాలు నేర్చుకున్నాను. ఆయన బిజీగా ఉండే వారు. ఆ తర్వాత నేను సమయం అక్కడ ఎక్కువ కేటాయించలేక యాను. ఏకా సుబ్బారావు రచించిన 'కొత్త సంగీత విద్యాదర్పణం' అనే పుస్తకం కొని చదివి పియానో కొనుక్కొని సంగీతం నేర్చుకున్నాను. నావద్ద ఒక పాత హార్మోనియం ఉండేది. దానిపై రాగయుక్తంగా పాడడం ఎలాగో సంవత్సరం పాటు రోజుకు ఆరుగంటలు సాధన చేశాను. దాంతో అనారోగ్యానికి గురయ్యాను. ఇప్పుడు ఇష్టమైన వేళల్లో సంగీత సాధన చేస్తున్నాను. మొత్తం 12 స్వరాలు నేర్చుకున్నాను. ప్రపంచంలోని అన్ని పాటలు కూడా ఈ స్వరాల్లోనే ఉంటాయి.. సంగీతం నేర్చుకోవడంతో నా బీఈడీ క్లాస్‌మెంట్ ఆర్ఎస్ వెంకటేశ్వర్‌రావు ప్రోత్సాహం ఉంది.దేశంలోని అన్ని భాషల పుస్తకాలు అధ్య యనం చేయడం ద్వారా భారతీయ సంస్కృతి, ఆచార వ్యవహారాలు అర్థమవుతాయి. ఏ పనిచేయాలన్నా నేర్చుకోవాలన్న ఉత్సాహం, సంకల్పం, పట్టుదల ఉండాలి. అందుకు తగిన సమయం కేటాయించాలి.

శాతవాహనకు రెగ్యులర్ వీసీ వచ్చేనా?

- ప్రారంభంకాని కొత్త కోర్సులు



శాతవాహన విశ్వవిద్యాలయం

గణేశ్‌నగర్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీలో సమస్యలు వీడడం లేదు. రెగ్యులర్ వీసీతో పాటు, అధ్యాపకుల కొరత, కొత్త కోర్సులు ప్రారం భం కాకపోవడంతో విద్యార్థులు నిరాశలో ఉన్నారు. బుధవారం ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్‌గా ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తంలను ప్రభుత్వం నియమించడంతో శాతవాహన యూనివర్సిటీకి కూడా రెగ్యులర్ వీసీ రావాలని విద్యాభిమానులు కోరుకుంటున్నారు.

తెలంగాణ రాష్ట్రంలోని 10 యూనివర్సిటీలలో శాతవాహన యూనివర్సిటీ గత ప్రభుత్వంలో చాలా వెనుకబడింది. బడ్జెట్ విషయంలో కొత్త రెగ్యులర్ కోర్సులు, పోస్టుల మంజూరు విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిందనే విమర్శలు ఉన్నాయి. 2008లో యూనివర్సిటీ ప్రారంభమైనప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం యూనివర్సిటీకి రెగ్యులర్ కోర్సులు ప్రాతిపదికన పోస్టులు మంజూరు చేసింది. యూనివర్సిటీకి 200 ఎకరాల భూమిని మంజూరు చేసింది. అప్పుడు ఉన్న వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఇక్బాల్ అలీ, ప్రొఫెసర్ వీరారెడ్డి కాంగ్రెస్ ప్రభుతాన్ని ఒప్పించి నూతన భవన నిర్మాణాలు, కొత్త కోర్సులకు ప్రతిపాదన తెచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత శాతవాహన యూనివర్సిటీలో ఒక కొత్త కోర్సు కూడా ప్రారంభించకపోవడం వల్ల విద్యార్థులు నిరాశకు గురయ్యారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత యూనివర్సిటీపై ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగ సంఘాలు కొత్త ఆశలతో ఉన్నారు. ఇప్పటికైనా మంత్రులు పొన్నంప్రభాకర్, శ్రీధర్‌బాబులు శాతవాహన విశ్వవిద్యాలయంపై దృష్టి సారించి యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీని నియమించి కొత్త రెగ్యులర్ కోర్సులు, కొత్త పోస్టులు మంజూరు చేసే విధంగా చూడాలని మేధావులు, విద్యార్థి సంఘాలు, విద్యార్థులు కోరుతున్నారు. బీసీని వీసీగా నియమించాలని బీసీ సంఘాలు, బీసీ విద్యార్థి సంఘాలు కోరుతున్నారు.

పురాతన ఆలయం పరిశీలన



సింగరాయగుట్టపై ఆలయాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

సైదాపూర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ శివారులో గల సింగరాయగుట్టపై గల పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని బుధవారం దేవాదాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఆలయం ప్రాముఖ్యత, ఆలయ అభివృద్ధిపై ప్రజలతో చర్చించారు. ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ అధికారులు మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఆలయాన్ని సందర్శించి పరిశీలించామన్నారు. ఆలయ విశిష్టతను ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, మాజీ ఎంపీపీ కామిని వీరేశం, సింగిల్‌విండో డైరెక్టర్ బొమ్మగాని రాజు, నాయకులు కూతురు విద్యాన్‌రెడ్డి, మునిగంటి సంతోష్, అనగోని శ్రీనివాస్, గోపగోని నవీన్, రమేష్, అశోక్, వెంకట్రాజం, సమ్మయ్య, రమేష్, పాల్గొన్నారు.

ఆలయ సమాచారం

ధర్మపురిలో కోజాగరి పౌర్ణమి వేడుకలు



పాలలో చంద్రుడిని వీక్షిస్తున్న అర్చకులు

ధర్మపురి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో కోజాగిరి పౌర్ణమి వేడుకలు బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఏటా నిర్వహించే విధంగా కోజాగిరి పౌర్ణమి సందర్భంగా స్థానిక లక్ష్మీనృసింహస్వామి దేవాలయం ప్రాంగణంలోని శేషప్ప కళా వేదిక వద్ద రాత్రి పాలలో చంద్రుడిని వీక్షించారు. రాత్రి వేళలో ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారల చిత్రపటానికి విశేష పూజలు జరిపారు. భక్తులు అర్ధరాత్రి వేళలో పాలలో చంద్రుడిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పొన్న శావపై శ్రీనివాసుడు

- పెద్ద సంఖ్యలో దర్శించుకున్న భక్తులు



స్వామివారి పొన్న శావకు స్వాగతం పలుకుతున్న భక్తులు

సిరిసిల్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల లక్ష్మీవేంకటేశ్వరస్వామి పొన్న శావపై భక్తులకు దర్శనమిచ్చాడు. సిరిసిల్లలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం పొన్న వాహనంపై గోవిందుడు భక్తులకు దర్శనమిచ్చాడు. లక్ష్మీవేంకటేశ్వరస్వామి విశేష అలకంరణతో దేవస్థానం నుంచి బయలు దేరాడు. శావ ముందు భక్తులు గోవిందా నామ స్మరణలు మార్మోగాయి. మహిళలు అడుగడుగునా స్వామివారికి మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆడపడుచుల కోలాటం, దాండియా, చిన్నారులు సంప్రాదాయ నృత్యాలతో సందడి చేశారు.

నేడు అంజన్న తలనీలాల టెండర్లు

- పదోసారి నిర్వహణకు ఏర్పాట్లు

మల్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం పరిధిలో తలానీలాలను పోగు చేసుకునేందుకు మరోసారి టెండర్లు గురువారం జరుగనున్నాయి. తగిన వేలం రావడం లేదని వాయిదా పడుతూ వస్తున్న టెండర్లు నిర్వహించడం ఇది పదోసారి. టెండర్ల నిర్వహణ కోసం హైదరాబాద్‌లోని దేవాదాయ కమిషనర్ కార్యలయంలో ఏర్పాట్లు చేయగా ఈ-టెండర్, సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం జరుగనుంది. కాగా గురువారం నిర్వహించే టెండరులో పాల్గొనడానికి ఐదు షెడ్యూల్స్ రాగా గతంలో సేకరించిన తలనీలాలలను కిలో చొప్పున అప్పగించేందుకు నిర్వహించిన టెండర్ కూడా రద్దు కావడంతో దానికి టెండరు జరుగనుంది.

సదర్‌మాట్‌పై ఆశలు

- చివరి దశకు బ్యారేజీ పనులు
- జగిత్యాల జిల్లాలో 4,896 ఎకరాలకు సాగునీరు



ఇబ్రహీంపట్నం, అక్టోబరు 16: గోదావరి నదిపై నిర్మించిన సదర్‌మాట్ బ్యారేజీ పనులు చివరి దశకు చేరుకున్నాయి. 2017 జనవరిలో పనులు ప్రారంభమయ్యాయి. ఈ బ్యారేజీ నిర్మాణంతో జగిత్యాల జిల్లాలోని 4,896 ఎకరాలకు సాగునీరు అందనుంది. నిర్మల్, జగిత్యాల జిల్లా సరిహద్దుల్లో ఉన్న సదర్‌మాట్ పనులు గత ఏడాది పూర్తి కావాల్సి ఉన్నా వరదలు, నిధుల విడుదలలో జాప్యంతో ఆలస్యమయ్యాయి. బ్యారేజీ నిర్మాణంతో ఇబ్రహీంపట్నం మండలం కోమటి కొండాపూర్, ఎర్దండి, మూల రాంపూర్, గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ భూములు ముంపునకు గురయ్యాయి. ప్రభుత్వం ఆ భూములకు నష్ట పరిహారం అందజేసింది.

• గంగనాల ప్రాజెక్టు మీదుగా..

సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణంలో జగిత్యాల జిల్లాలోని 4,896 ఎకరాలకు సాగునీరు అందతుంది. సదర్మాట్ బ్యారేజీ నుంచి వేములకుర్తి శివారులోని గంగానాల ప్రాజెక్టును నింపుతారు. అక్కడి నుంచి పంట పొలాలకు సాగునీరు అందించనున్నారు. ఈ ప్రాంత రైతులు యాసంగిలో సాగు నీరు అందక ఇబ్బంది పడేవారు. సదర్‌మాట్ బ్యారేజీతో ఆ ఇబ్బందులు తీరుతాయి. ప్రస్తుతం సదర్‌మాట్ గేట్లు తెరవడంతో చివరి ఆయకట్టు వరకు నీరందుతోంది. ఈ ప్రాంతం పచ్చని పొలాలతో కళకళలాడుతోంది.

• త్వరలో బ్యారేజీని ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

సదర్‌మాట్ బ్యారేజీని ఈ నెలాఖరు నాటికి ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బ్యారేజీ ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి రానున్నట్లు సమాచారం. రెండు జిల్లాల సరిహద్దులో నిర్మించిన సదర్‌మాట్ బ్యారేజీని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే రెండు జిల్లాలకు చెందినవారు బ్యారేజీ సందర్శనకు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. బ్యారేజీ పరిసర ప్రాంతాల్లో వసతులు కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నెలాఖరులో ప్రారంభానికి ఏర్పాట్లు - లక్ష్మి, సదర్‌మాట్ ఈఈ

సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణ పనులు 95 శాతం పూర్తి అయ్యాయి. ఈ నెల చివరి నాటికి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. బ్యారేజీ నిర్మాణంతో 18 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తాం. బ్యారేజీతో ఎంతో ఉపయోగం.

రెజ్లింగ్‌లో ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ప్రతిభ



రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పతకాలు సాధించిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా రెజ్లర్లు సత్తా చాటారు. హైదరాబాద్‌లో ఈనెల 15, 16 తేదీల్లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్-19 రెజ్లింగ్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ క్రీడాకారులు మూడు రజత, ఆరు కాంస్య పతకాలు సాధించారు. రుక్మాపూర్ సైనిక్ పాఠశాలకు చెందిన విజయ్‌కుమార్, సిద్ధార్థలు రజత పతకం కైవసం చేసుకున్నారు. బి నర్సింహ, కె రాజరథన్, ఎన్ దినేష్‌లు కాంస్య పతకాలు సాధించారు. ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ జూనియర్ కళాశాలకు చెందిన కె రాజు రజతం, కె అజయ్ కాంస్య పతకం, అల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు చెందిన వి రఘుచరణ్ కాంస్య పతకం, ట్రినిటి జూనియర్ కళాశాలకు చెందిన సీహెచ్ ఆదిత్య మహరాజ్ కంస్య పతకం సాధించినట్లు టీం కోచ్ ఎం వంశీకృష్ణ తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం, కళాశాలల క్రీడా సమాఖ్య కరీంనగర్ జిల్లా కార్యదర్శి మధుజాన్సన్‌లో అభినందించారు.

రూ.6,950 పలికిన పత్తి ధర

జమ్మికుంట, అక్టోబరు 16: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,950 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 57మంది రైతులు 368క్వింటాళ్ల విడి పత్తి, 12మంది రైతులు 17క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,950, కనిష్ఠ ధర రూ.6,300 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక అక్టోబర్ 16: మండలంలోని ఇప్పలపల్లి చల్లూరు గ్రామాల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఎలాంటి అనుమతులు లేకుండా మానేరు వాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్న మూడు టాక్టర్లను పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఇప్పలపల్లి గ్రామానికి చెందిన కొయ్యడ నవీన్,చల్లూరు గ్రామానికి చెందిన టాక్టర్ డ్రైవర్లు ఓనర్లు బోంగోని కూమార్,బోంగోని సదయ్యతూడి రాజులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

పశువులను కాపాడుకుందాం!

- ప్రమాదకరంగా గాలికుంటు వ్యాధి
- నెల రోజులపాటు టీకాల పంపిణీ



హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం అమల్లో భాగంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ మంగళవారం ప్రారంభమైంది. పశువుల్లో గాలికుంటు వ్యాధి చాలా ప్రమాదకరం. ఇది సూక్ష్మ క్రిములతో పాటు కలుషిత నీరు, ఆహారం, వాయు కాలుష్యం ద్వారా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి నివారణ కోసం పశువులకు టీకాలు వేస్తున్నారు. ఈ నెల 15 నుంచి నెల రోజుల పాటు టీకాల పంపిణీ కొనసాగనుంది. నూరుశాతం వ్యాక్సినేషన్ వేసేలా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. టీకా సామర్థ్యం ఆరు నెలలు.. ప్రతి ఆరు నెలకొకసారి అధికారులు మూగజీవాలకు టీకాలు వేస్తుంటారు. మూడు నెలల వయసు దాటిన ప్రతి ఆవు, గేదెలకు టీకాలు వేయనున్నారు.

• పనితీరుపై ప్రభావం

దేశవాళి కంటే ఎక్కువగా సంకరజాతి పశువుల్లో గాలికుంటు వ్యాధి తీవ్రత ఎక్కువ. దేశవాళి పశువుల్లో ప్రాణ నష్టం పెద్దగా లేకున్నా వ్యాధి తీవ్రత అధికం. టీకాలు వేయించకుంటే ఊపిరితిత్తుల పనితీరుపై ప్రభావం పడి పశువులకు తీవ్రంగా రొప్పు రావడం, పనిచేసే సామర్థ్యం తగ్గి, పాల ఉత్పత్తి పడిపోతుంది. ఓ దశలో చిన్న పశువులు అధిక ఉష్ణోగ్రతలతో మృతి చెందే ప్రమాదం ఉంటుంది. వ్యాధి భారినపడ్డాక వైద్యం చేయిచటం కంటే ముందే అప్రమత్తమై రైతులు పశువులకు టీకాలను వేయించాలి.

• లక్షణాలు ఇలా

పవువులు నడవకలేక పోవడం, దుక్కిటెడ్లు పనులు చేసే సామర్థ్యాన్ని కోల్పోతాయి. 103 నుంచి 106 డిగ్రీల జ్వరం రావడం, నోట్లో, చిగుళ్లపై పొక్కులు వచ్చి మేత, నీరు తీసుకోలేవు. నోటి నుంచి చొంగకారడం, కాలు గెట్టెల్లో పుండ్లుపడి పురుగులు కనిపిస్తాయి. పాడి పశువుల్లో పాల దిగుబడి తగ్గుతుంది. దీనికి చికిత్స ఖర్చు ఎక్కువగా ఉంటుంది.

రైతులు టీకాలు తప్పక వేయించాలి

-పి. రవీందర్‌రెడ్డి, పశువైద్యాధికారి, సింగాపూర్



వర్షాకాలం కావడంతో పశువులకు గాలికుంటు వ్యాధి వచ్చే అవకాశం ఉంది. రైతులు నిర్లక్ష్యం చేయకుండా పశువులకు టీకాలు తప్పకుండా వేయించాలి. వ్యాధి రాకుండా రక్షణకు టీకాలు ఎంతో అవసరం.

ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. కలెక్టరేట్‌లో వానాకాలం సీజన్ 2024 ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో 3 లక్షల మెట్రిక్ టన్నుల పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందనే అంచనాతో, పీఏసీఎస్ ద్వారా 194, ఐకేపీ ద్వారా 44, డీసీఎంఎస్ ద్వారా 8, మెప్మా ద్వారా 4, మొత్తం 250 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వివరించారు. ప్రతీ ధాన్యం కొనుగోలు కేంద్రం పరిధిలో సన్న రకం, రైతుల సంఖ్య, పంట దిగుబడి, వాటిని ఏ రైస్ మిల్లులకు పంపుతారు మొదలగు వివరాలను కొనుగోలు కేంద్రాల వారిగా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సన్న రకం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జి వ్యవసాయ విస్తరణ అధికారితో సమన్వయం చేసుకుంటూ గుర్తించాలన్నారు. వీటిని కొనుగోలు చేసిన తర్వాత ప్రత్యేకంగా కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తాగు నీరు, విద్యుత్ సరఫరా, లైట్లు మొదలగు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేందుకు వీలుగా అవసరమైన మేర వాహనాలు సన్నద్ధ చేయాలని, సదరు వాహనానికి జీపీఎస్ సిస్టంను ఏర్పాటు చేయాలని, వాహనం నంబరు డ్రైవర్, క్లీనరు ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక నంబరు కేటాయించాలని, సన్న రకం ధాన్యం బ్యాగులపై ఆ నంబరు, ప్రత్యేకమైన గుర్తింపు కోసం స్టాంప్ వేయాలని, రైతులకు ముందస్తుగానే ప్రణాళిక ప్రకారం టోకెన్‌లు అందజేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్‌లు కొనుగోలు కేంద్రాలకు ఎన్ని అందించినారని పౌరసరఫరాల శాఖ అధికారి నుంచి అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు దగ్గరే ధాన్యం నాణ్యతను కట్టుదిట్టంగా పరిశీలించాలని, రైస్ మిల్లుల వద్ద ఎటువంటి కోతలు ఉండడానికి వీలులేదని అన్నారు. ప్రతీ రోజు ధాన్యం కొనుగోలుకు సంబంధించిన నివేదిక సమర్పించాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. రోడ్ల మీద ధాన్యం ఆరబెట్టి రోడ్డు ప్రమాదాలకు దారి తీయకుండా చూడాలన్నారు. రైతులు టోకెన్ పద్ధతిలో మాత్రమే సెంటర్‌కు ధాన్యం తీసుకొచ్చి కొనుగోలు చేసే విధంగా చూడాలన్నారు. ధాన్యం రవాణాకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రతీ సెంటర్‌కు సరిపడ వాహనాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, పీడీ డీఆర్‌డీఏ శేషాద్రి, సివిల్ సప్లయి అధికారి వసంతలక్ష్మి, డీఎం సివిల్ సప్లయి రజిత, డీసీవో రామకృష్ణ, ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి రామారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

న్యూస్ బాక్స్

బ్రాస్‌లెట్ అప్పగింత



బ్రాస్‌లెట్ అందజేస్తున్న ఎస్సై

ఇల్లంతకుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందికట్కూర్ గ్రామంలోని రేణుకాదేవి ఆలయం వద్ద దొరికిన బంగారు బ్రాస్‌లెట్‌ను ఎస్సై శ్రీకాంత్ గౌడ్ బుధవారం అప్పగించారు. వేములవాడకు చెందిన వంతెన శ్రీకాంత్ మంగళవారం రేణుకాదేవి ఆలయానికి వచ్చాడు. అతడి చేతికి ఉన్న బ్రాస్‌లెట్ పడిపోయింది. కొంతసేపటికి గ్రామానికి చెందిన వ్యక్తికి దొరకింది. దీంతో 100 నంబరుకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చాడు. బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ జీవన్ వెళ్లి బ్రాస్‌లెట్‌ను స్వాధీనం చేసుకున్నాడు. బ్రాస్‌లెట్ పోగొట్టుకున్న వ్యక్తి సమాచారం సేకరించి అతడికి పోలీస్‌స్టేషనలో తిరిగి అప్పగించారు.

కుక్కల దాడిలో దూడకు గాయాలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రాజిరెడ్డికి చెందిన దూడ మంగళవారం కుక్కల దాడిలో గాయ పడింది. రైతు రాజిరెడ్డి తన ఇంటి సమీపంలో పాడి గేదెతో పాటు దూడను కట్టేశాడు. కుక్కల గుంపు దూడపై దాడికి దిగింది. ఇటీవల గ్రామంలో కుక్కల బెడద అధికమైందని గ్రామస్థులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని కుక్కల బెడద నుంచి రక్షించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గంభీరావుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం మూలపల్లె స్టేజీ వద్ద మంగళవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో గోరంటాలకు చెందిన బందెల రాజయ్య (56) మృతి చెందాడు. రాజయ్య కూలి పని కోసం మక్తానాయక్ తండాకు వెళ్లి సైకిల్‌పై తిరిగి వస్తున్నాడు. గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివకుమార్ తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

గంభీరావుపేట, అక్టోబరు 16 : (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు ఎర్ర ఎల్లాగౌడ్ భార్య సువర్ణ ఇటీవల మృతి చెందగా, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు బుధవారం పరామర్శించారు. ఆయన వెంట సింగిల్‌విండో వైస్ చైర్మన్ రామాంజనేయులు, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, నాయకులు శేఖర్‌గౌడ్, పర్శరాములు, కిషన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

బోయినపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బోయినపల్లి మండలం మల్కాపూర్‌గ్రామానికి చెందిన బోడ నర్సయ్య (50) పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన నర్సయ్యకు 18 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. దంపతులకు సంతానం కలగకపోవడంతో మనస్తాపం చెందాడు. భార్య పండగకు పుట్టింటికి వెళ్లడంతో మంగళవారం పురుగుల మందు తాగాడు. వెంటనే బంధువులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. నర్సయ్య భార్య మంజుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు.

బాధిత కుటుంబాలకు..

ఇల్లంతకుంట, అక్టోబరు 16 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో బాధిత కుటుంబాలను బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రం తిరుపతిరెడ్డి బుధవారం పరామర్శించారు. వల్లంపట్ల గ్రామానికి చెందిన పోచవ్వ, పొత్తూరు గ్రామానికి చెందిన ఐలవ్వ, గాలిపెల్లి గ్రామానికి చెందిన తిరుపతి, రవి వివిధ కారణాలతో మృతి చెందారు. బాధిత కుటుంబాలకు బియ్యాన్ని పంపిణీ చేశారు.

ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు

జగిత్యాల అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సత్తెమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సిరిసిల్ల అభివృద్ధికి మరింత కృషి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ సహకారంతో సిరిసిల్ల పట్టణ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం 18వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు చైర్ పర్సన్ కళాచక్రపాణి భూమి పూజను నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆయా వార్డులో అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా 18వ వార్డులో రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రాంభించామన్నారు. మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం పాలకవర్గం పారదర్శకంగా కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, 6వ వార్డు కౌన్సిలర్ గుండ్లపెల్లి రామానుజం, ఏఈ నరసింహస్వామి, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న చైర్ పర్సన్ కళాచక్రపాణి

రేపటి నుంచి రిలే నిరాహార దీక్షలు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులను వెంటనే విడదల చేయాలని తాజా మాజీ సర్పంచుల జేఏసీ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శుక్రవారం నుంచి రిలే నిరాహార దీక్షలను చేపట్టనున్నట్లు జేఏసీ జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రిలే నిరాహారదీక్షలను చేపట్టడం కోసం జేఏసీ నాయకులు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు గ్రామాలలో అభివృద్ధి కోసం సర్పంచులు అప్పులు చేసి అభివృద్ధి పనులను చేశారన్నారు. బిల్లులు రాక రాష్ట్రంలో చాలా మంది సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వాలు స్పందించలేదని ఆరోపించారు. సర్పంచ్‌లకు రావల్సిన పెండింగ్ బిల్లులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విడదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18 శుక్రవారం ఉదయం తాజా మాజీ సర్పంచ్‌ల జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలను చేపడుతున్నామన్నారు. జిల్లాలోని తాజా మాజీ సర్పంచ్‌లు పెండింగ్ బిల్లులు సాధించుకోవడం కోసం తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్‌లు జేఏసీ జిల్లా ఉపాధ్యక్షురాలు గనప శివజ్యోతి, కార్యదర్శి కోల నర్సయ్య, నాయకులు ఏనుగుల కేశవరావు, పడిగెల రవీందర్, గాండ్ల సుమతి, దోమకొండ ఎల్లం పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న జేఏసీ నాయకులు

అన్ని గ్రామాల్లో కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధరను కల్పించాలని, అన్ని గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో దాదాపు 25 శాతం రైతాంగం తక్కువ ధరకు రైస్ మిల్లులకు ధాన్యంను అమ్ముకొని నష్టపోయారని అన్నారు. ప్రభుత్వం అధికారులు సరైన సమయానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం మూలంగా తప్పని పరిస్థితులలో తక్కువ దరకు రైస్ మిల్లుకు అమ్ముకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలంటే రైతు పండించిన ధాన్యంను ఆరబెట్టుకోవడం కోసం ప్రతి గ్రామంలో ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన ధాన్యం ఆరబెట్టడం కోసం ఆ భూమి ఉపయోగపడుతుందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. చాలా మంది రైతులు రోడ్లపై ధాన్యం ఎండబెడుతూ ప్రమాదాలతో మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తూ మద్దతు ధరను చెల్లించాలన్నారు. రైతులు అమ్ముకున్న ధాన్యానికి మూడు రోజులలో ఖాతాలలో డబ్బులను జమ చేయాలని కోరారు. అదే విధంగా ఐకేపీ, సొసైటీ కేంద్రాలలో మౌలిక వసతులను కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మంద సుదర్శన్, సోమ నాగరాజు పాల్గొన్నారు.

దళితులను విడగొడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



గంభీరావుపేటలో మాట్లాడుతున్న చంద్రం

గంభీరావుపేట, అక్టోబరు 16 : (ఆంధ్రజ్యోతి) అన్నదమ్ముల వలే కలిసి ఉన్న దళితులను వర్గీకరణ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడగొడుతున్నాయని మాల మహానాడు ఆఫ్ ఇండియా రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం ఆరోపించారు. గంభీరావుపేట మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద 'వర్గీకరణ వద్దురా.. కలిసి ఉంటేనే ముద్దురా' అంటూ మాల మహానాడు నాయకులు బుధవారం నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దోసల చంద్రం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్లు తొలగించే క్రమంలో ఎస్సీలను విడగొట్టి పాలించే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. దళితులు ఐక్యంగా ఉండి హక్కులను కాపాడుకోవాలని, రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. దళితులు ఏకమైతే అగ్రవర్ణాల ఆటలు సాగవనే ఉద్దేశంతో వర్గీకరణ పేరుతో దళితుల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. ఇకనైన మనమంత కళ్లు తెరవాలని, మన మధ్య చిచ్చు పెట్టే వారికి తగిన బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. మాలల ఐక్య వేదిక జిల్లా నాయకులు మల్యాల రాజవీర్, దోసల శంకర్, సుదర్శన్, రవి, జీవన్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని, ప్రైవేటు కళాశాలలను ఆదుకోవాలని లేకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలంటూ ప్రైవేటు విద్యా సంస్థలు బంద్‌ను చేపట్టాయని, దీంతో అందులో చదివే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే ఫీజులు విడుదల చేసి కళాశాలలను తెరిపించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేష్, నాయకులు సాత్విక్, రాహుల్, సాయిభరత్, శివ తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గంభీరావుపేట, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామంలో బుధవారం సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ అందజేశారు. గ్రామానికి చెందిన మల్లారపు ప్రవల్లిక రాజుకు రూ.60 వేల చెక్కు మంజూరైనట్లు తెలిపారు. ఈ సందర్భ చెక్కు మంజూరు సహకరించిన సిరిసిల్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు రామచంద్రం, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ విఠల్‌నాయక్, నాయకులు భాస్కర్, మోహన్ తదితరులు ఉన్నారు.

పట్టభద్రులు విధిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

బోయినపల్లి అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు విధిగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ పులి ప్రసన్న హరికృష్ణ గౌడ్ అన్నారు బోయినపల్లి మండల కేంద్రంలో పట్టభద్రుల ఓటు హక్కు నమోదు కోసం బుధవారం కార్యాలయాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ప్రసన్న హరి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చిలో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టబద్రులు ఓటు హక్కును నమోదు చేసుకునేందుకు నవంబరు 6 వరకు చివరి తేదీ అన్నారు. ఇదివరకు ఓటు హక్కు వినియోగించుకున్న వారు సైతం తప్పనిసరిగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలు పోటీలో ఉంటానన్నారు. రెండు దశాబ్దాలుగా ప్రొఫెసర్‌గా పని చేస్తూ ఎంతోమంది పట్టభద్రులను తీర్చిదిద్దినట్లు చెప్పారు. విన్నర్స్ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందించామన్నారు. నిరుద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పరిష్కరిస్తానన్నారు. ఈ సందర్భంగా పట్టబదులకు ఓటరు నమోదు పేపర్లను అందజేశారు. ఆయన వెంట ల్యాద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా టేకు కలప నరికివేత

- మానాల-మల్యాల అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల వధ
- నిత్యకృత్యంగా మారిన అక్రమ తరలింపు

మల్యాల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మల్యాల-మానాల అటవీ ప్రాంతం నుంచి నిత్యం టేకు కలప అక్రమంగా రవాణా అవుతోంది. కొందరు దుండగులు యథేచ్ఛగా టేకు చెట్లను నరికివేస్తూ కలప తరలిస్తున్నారు. అయినప్పటికీ అటవీ అధికారుల నిర్లక్ష్యంపై ఈ ప్రాంత ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మల్యాల-మానాల శివారు గుట్టలలో టేకు వనం పరచుకుంది. ఇక్కడ అటవీ ప్రాంతం ఎక్కువగా ఉండడంతో వన్యప్రాణులు నిత్యం పెద్ద ఎత్తున సంచరిస్తుంటాయి. కొందరు అక్రమార్కులు రాత్రివేళల్లో టేకు కలప తరలిస్తూ, వన్యప్రాణుల కోసం ఉచ్చులు అమర్చుతున్నారు. దీంతో వన్యప్రాణులు ఉచ్చులకు చిక్కుతుండగా వివిధ ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇక టేకు కలపను ఇష్టారాజ్యంగా నరికివేస్తున్నారు. వారం రోజుల క్రితం కొందరు వ్యక్తులు ద్విచక్రవాహనాలపై కలపను తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసులను చూసి పారిపోవాలని ప్రయత్నించగా విఫలం అవడంతో వాహనాలతో పాటు కలపను అక్కడే వదిలిపెట్టి పారిపోయారు. రెండు రోజులుగా మానాల అటవి ప్రాంతంలోనూ అక్రమంగా నరికివేసినట్లు గ్రామస్తులు తెలిపారు. వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు.

అంబేద్కర్ విద్యానిధి గడువు పొడిగింపు

జగిత్యాల అర్బన్, అక్టోబరు 16: తెలంగాణ విదేశీ విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఉన్నత విద్యను అభ్యసించేందుకు షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు ఇచ్చే అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం గడువు ఈ నెల 29 వరకు పెంచినట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ అధికారి రాజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, యూకే, సింగాపూర్, జర్మనీ, జపాన్, సౌత్ కొరియా, న్యూజిలాండ్ తదితర దేశాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యను అభ్యసించడానికి వెళ్లే విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోందని పేర్కొన్నారు.

అంతా అయోమయం

5వ పేజీ తరువాయి...

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ ఎప్పుడో?

జిల్లాలో 12 మండలాలు, సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీలకు సంబంధించి 6886 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేశారు. ఇందుకోసం రూ. 374.41 కోట్లనిధులు వ్యయంగా నిర్ణయించారు. ఇందు లో 5437 ఇళ్లకు మాత్రమే టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. 4248ఇళ్ల నిర్మాణాలు చేపట్టి 3546 పూర్తి చేశా రు. ఇందులో 3448 లబ్ధిదారులకు అందించారు. రూ.188.49 కోట్లు ఖర్చు చేశారు. 702 ఇళ్లు నిర్మాణ దశ లోనే ఆగిపోయాయి. కొన్ని దాదాపు పూర్తయిన మౌలిక సదుపాయాలు లేక పంపిణీకి నోచుకోవడం లేదు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోనూ ఇళ్ల నిర్మాణాలు పూర్త యిన అనేక వివాదాల మధ్య అందించడం లేదు. పూర్త యిన ఇళ్లు కేటాయింపునకు నోచుకోక శిథిలావస్థకు చేరుకున్నాయి. అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల్లో సిరిసిల్ల మండ లంలో 2052 ఇళ్ల లక్ష్యాన్ని పూర్తి చేశారు. ముస్తాబాద్ 702 ఇళ్లకు 429, తంగళ్లపల్లి 549 ఇళ్లకు 110, ఎల్లా రెడ్డిపేట 490 ఇళ్లకు 320, గంభీరావుపేట 476 ఇళ్లకు 371, వీర్నపల్లి 160 మంజూరవగా 50 ఇండ్ల నిర్మాణం ప్రారంభించ్చారు. ఒక్కటి కూడా పూర్తి కాలేదు. ఇల్లంత కుంటలో 340 ఇళ్లకు 184 పూర్తి చేశారు. వేములవాడ రూరల్ మండలంలో 1080 ఇళ్లకు80 పూర్తవగా వేముల వాడ అర్బన్‌లో 800ఇళ్లకు ఒక్కటి కూడా పూర్తి కాలేదు. కోనరావుపేట మండలం 92, చందుర్తి 45, రుద్రంగి 35, బోయినపల్లి 65ఇళ్లు మంజూరైనా ఇప్పటి వరకు నిర్మా ణాలు ప్రారంభం కాలేదు. మంజూరైనా ఇప్పటివరకు ప్రారంభం కానివి ముస్తాబాద్ 175ఇళ్లు, తంగళ్లపల్లి 178, ఎల్లారెడ్డిపేట 106, గంభీరావుపేట 43, వీర్నపల్లి 87, ఇల్లంతకుంట 156, వేములవాడ రూరల్ 1000, వేములవాడ అర్బన్ 656, కోనరావుపేట 92, చందుర్తి 45, రుద్రంగి 35, బోయినపల్లి 65 ఇళ్లకు టెండర్లు పూర్తయ్యాయి.

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

- బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు

- ఎస్పీ అఖిల్‌మహాజన్

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ పాటు పడుతున్నట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట సర్కిల్ పోలీస్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు, కేసుల వివరాలు, వర్టికల్స్ అమలు తీరు, సిబ్బంది విధులు, స్టేషన్ పరిసరాలు, వివిధ రోడ్డు ప్రమాదాల్లో స్వాధీన పర్చుకున్న వాహనాలను పరిశీలించారు. నమోదవుతున్న కేసుల వివరాలు, సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా పరిశోధన పటిష్టంగా ఉండాలని సూచించారు. అనంతరం ఎస్పీ అఖిల్‌మహాజన్ మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీసు విధులను నిర్వర్తిస్తున్నామన్నారు. ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పల్లెల్లో నేరాలను అరికట్టేందుకు విజిబుల్ పోలీసింగ్‌ను అమలు చేస్తున్నట్లు చెప్పారు. వీపీవోలు ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలన్నారు. పాత నేరస్థులు, అనుమానితులు, రౌడీషీటర్లపై నిఘాను తీవ్రతరం చేశామన్నారు. గంజాయి అక్రమ రవాణా, తాగడం, అసాంఘీక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి కట్టడి చేసేందుకు ముందుకు సాగుతున్నామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని ఎస్పీ అఖిల్‌మహాజన్ హెచ్చరించారు. ఆయన వెంట సీఐ శ్రీనివాస్, ఎస్సై రమాకాంత్, శిక్షణ ఎస్సై రాహుల్‌రెడ్డి ఉన్నారు.

సభ్యత్వ నమోదులో లక్ష్యాన్ని సాధించాలి

- ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్



బీజేపీ నాయకులతో మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ సభ్యత్వ నమోదును అనుకున్న లక్ష్యానికి సాధించేందుకు నాయకులు ప్రజాప్రతినిధులు శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, బూత్ కమిటీ అధ్యక్షులు కృషి చేయాలని ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే, రాజన్న సిరిసిల్ల జిల్లా జోనల్ ఇన్‌చార్జి పాయల్ శంకర్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని పంచాయతీ రాజ్ అతిథి గృహంలో బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదును పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వ నమోదును ముగించడానికి ఒక వారమే గడువు ఉందని, పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమాలను చేపట్టాలని అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ మల్లారపు సంతోష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, రేగుల మల్లికార్జున్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్, అల్లాడి రమేష్, గరిపెల్లి ప్రభాకర్, సత్తయ్య, అన్నీ మండలాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.


జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

కోరుట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బీడి కార్మిక సంఘం జిల్లా మహాసభలు మల్యాల మండల కేంద్రంలో అక్టోబరు 26వ తేదీన నిర్వహిస్తున్నామని కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీడి కార్మిక సంఘ నాయకులు కోరారు. పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో బుధవారం బీడి కార్మికులతో కలిసి సంబదింత కరపత్రం, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీడి కార్మిక సంఘ నాయకులు మాట్లాడారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఆందోళన గురించి తీర్మానం చేసి సమస్యలు ప్రభుత్వాల దృష్టికి తీసుకపోయే విధంగా చర్చలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఏఐటీయుసీ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర బీడి వర్కర్ ఫెడరేషన్ అధ్యక్షుడు బోగ గోవర్ధన్ హజరై కార్మికులకు మార్గదర్శకం చేయనున్నట్లు తెలిపారు. మహాసభలు జయప్రదం చేసి కార్మికుల ఐక్యత చాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీడీ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు, కార్మిక సంఘ నాయకులు కొక్కుల శాంత, చెన్న విశ్వనాథం, ఎండీ ముక్రం, ఎండి మౌలానా, ఎన్నం రాద, వడ్ల బాగ్యమ్మ, ఎన్నం రాజగంగు, ఎండీ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

మందు బాబులకు అడ్డాగా పాఠశాల

- బడి ఆవరణలో మద్యం సీసాలు

- తరగతి గదుల తలుపులు ధ్వంసం



ధ్వంసం చేసిన పాఠశాల తలుపులు

కోనరావుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారింది. పాఠశాలకు దసరా సెలవులు రావడంతో ఉపాధ్యాయులు బడికి తాళం వేసి ఉంచారు. ఈ క్రమంలో మందుబాబులు పాఠశాల ఆవరణలోనే మద్యం తాగారు. ఖాళీ బీరు సీసాలు, మాంసం ముక్కలు, ప్లేట్లు ఆవరణలో చిందరవందరగా పడేశారు. పాఠశాలకు వేసి ఉంచిన తాళాలు పగలగొట్టి తరగతి గదులు, తలుపులను ధ్వంసం చేశారు. మంగళవారం పాఠశాలలు ప్రారంభం కావడంతో ఉదయం వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఖాళీ సీసాలు, ప్లేట్లు దర్శనమిచ్చాయి. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. పోలీసులు దృష్టిసారించి రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించాలని, మందు బాబులను గుర్తించి, వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. మండలంలోని కనగర్తి ప్రభుత్వ పాఠశాలతోపాటు పలు పాఠశాలల్లో మందుబాబులు మద్యం తాగుతున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పోలీసులు పట్టించుకోవాలని కోరుతున్నారు.



పాఠశాల గదిలో పడేసిన మందు సీసాలు